ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 26 జూలై 2024





- వివిధ పద్దుల కింద కేటాయిస్తూ ప్రకటన
- నీటి పారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- మెగాటెక్స్‌టైల్ పార్క్‌కు మొండిచేయి
- ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు శూన్యం
- ఊసులేని కొత్త సెంట్రల్ జైలు నిర్మాణం, కాళోజీ కళాక్షేత్రం
- స్మార్ట్‌సిటీ పనులకు మ్యాచింగ్ గ్రాంట్
- ఎకో టూరిజంగా పాకాల, ఏటూరునాగారం
- మేడారం జాతర పనులకు నిధులు

కొంత మోదం.. కొంత ఖేదం..

రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు రూ.2,595.53 కోట్లు


హనుమకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చేసిన కేటాయింపులు చూస్తే కొంత మోదం.. కొంత ఖేదం అన్నట్టుగా ఉందని జిల్లావాసులు అభిప్రాయ పడుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులకు, ముఖ్యంగా ఎత్తిపోతల పథకాలకు ఎక్కువ నిధులను కేటాయించిన ప్రభుత్వం.. ఎంతో కీలకమైన మెగాటెక్స్‌టైల్‌పార్క్, కాళోజీ కళాక్షేత్రం, ఆసుపత్రుల అభివృద్ధి, సెంట్రల్‌జైల్ నిర్మాణం, వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం లాంటి వాటిని పట్టించుకోలేదన్న చర్చ జరుగుతోంది. నీటిపారుదలతో పాటు వివిధ పద్దుల కింద ఉమ్మడి జిల్లాకు మొత్తంగా రూ.2595.53 కోట్లను నిర్దేశించారు. గత ఆర్థిక సంవత్సరం 2023-24 కన్నా సుమారు రూ.350కోట్లు ఎక్కువని తెలుస్తోంది. ఎత్తిపోతల పథకాలైన కాళేశ్వరం, దేవాదుల, ఎస్ఆర్ ఎస్‌లకు రూ. 2376.55కోట్లు, ఇతరత్రా పద్దుల కింద రూ.218.97 కోట్లను కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం నాణ్యత విషయంలో వివాదం నడుస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు, నిర్వహణ, ఇతరత్రా ఖర్చులకు గాను రూ.1676.46 కోట్లను కేటాయించగా.. గత బడ్జెట్ కన్నా ఈ సారి రూ.50కోట్లు ఎక్కువగానే ఇచ్చారు. దీంతో పాటు కాకతీయ విశ్వవిద్యాలయం, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ, వరంగల్ మహానగర పాలక సంస్థ, వరంగల్ స్మార్ట్ సిటీ, మేడారం తదితర వాటికి బడ్జెట్‌లో నిధులను ఇస్తున్నట్టు ప్రస్తావించారు. అయితే బడ్జెట్‌లో గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మెగాటెక్స్‌టైల్ పార్క్, వరంగల్ సెంట్రల్ జైల్ నిర్మాణం ఊసేలేదు.

సీఎం పరిశీలించి వెళ్లినా..

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో భాగంగా మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను సందర్శించి.. పార్క్ సత్వర పూర్తికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాత సెంట్రల్ జైలు స్థానంలో నిర్మిస్తున్న మల్టీసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి నిధుల అంశం కూడా బడ్జెట్‌లో కానరాలేదు. సీఎం రేవంత్ నగర పర్యటనలో భాగంగా దీనిని కూడా సందర్శించారు. అయితే దీని నిర్మాణ అంచనా వ్యయాన్ని అడ్డగోలుగా పెంచడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలోనే ఈ ఆస్పత్రికి నిధులను కేటాయించి ఉండకపోవచ్చునన్న చర్చ జరుగుతోంది. కేఎంసీలో ఆవరణలో ఇటీవల నిర్మించిన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, వరంగల్ ఎంజీఎం, కాళోజీ కళాక్షేత్రం, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)ను పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని స్మార్ట్ సిటీ పథకానికి బడ్జెట్‌లో మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చిన ప్రభుత్వం అసంపూర్తిగా మిగిలిపోయిన స్మార్ట్ సిటీ పనుల పూర్తికి రూ 156.22 కోట్లను ఇచ్చింది. మిగిలిపోయిన జాతర పనులకు రూ.52..95 కోట్లను నిర్దేశించింది. నగరంలోని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన నియో మెట్రోరైల్ ప్రాజెక్టు అంశం పేర్కొన్నప్పటికీ నిధులపై స్పష్టత ఇవ్వలేదు. లెదర్ పార్క్, వరంగల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు గురించి పేర్కొన లేదు. మహబూబాబాద్‌లో మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం, జనగామ కల్లెంలో టెక్స్‌టైల పార్క్, కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్, ములుగు జిల్లాలో బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ, రామప్ప గుడి అభివృద్ధి, భూపాలపల్లిలో మైనింగ్ విద్యాలయం తదితర అంశాలకు బడ్జెట్‌లో చోటు దక్కలేదు.

12 చిన్న తరహా పారిశ్రామిక పార్కులకు అవకాశం

మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ ప్రత్యేక చిన్నతరహా పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో ఈ తరహా పార్కులు 12 వరకు ఏర్పాటయ్యే అవకాశం ఉంది.



3.70 లక్షల మంది రైతులకు భరోసా

రైతు భరోసా అమలుపై శాసన సభలో మరోసారి ప్రభుత్వం ప్రకటన చేసింది. బడ్జెట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతులకు ఏటా ఎకరానికి రూ. 15000 చెల్లించాలన్నది తమ సంకల్పమని, దీనిపై శాసనసభలో చర్చించి విధి విధానాలను ఖరారు చేసిన తర్వాత అమలు చేస్తామని స్పష్టం చేసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తుండగా ఉమ్మడి జిల్లాలో సుమారు 3.70లక్షల మంది రైతు భరోసా అందుకోనున్నారు. అలాగే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు కేటాయించడం పట్ల అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.



వ్యవసాయ కూలీలకూ ఆర్థిక సాయం

భూమిలేని నిరుపేద రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు అందించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ప్రకటించగా ఉమ్మడి జిల్లాలో సుమారు 3.20లక్షల మంది రైతు కూలీలకు ప్రయోజనం చేకూరనుంది.

ఎకో టూరిజంగా పాకాల, ఏటూరునాగారం

ఎకో టూరిజాన్ని ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా పాకాల, ఏటూరునాగారంలను టూరిజం సర్క్యూట్లుగా గుర్తించినట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో గుర్తించిన ఏడు అటవీ ప్రాంతాల్లో ఈ రెండు ఉన్నాయి. పాకాల, ఏటూరునాగారం అటవీ ప్రాంతాలను ఎకో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను కేటాయించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఈ రెండు ప్రాంతాలు పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి.



నిధుల కేటాయింపు ఇలా.. (అంచనా)

కాళేశ్వరం ప్రాజెక్టు :	రూ.1676.46 కోట్లు
ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 1:	రూ.140.00 కోట్లు
దేవాదుల (జీఎల్ఎస్):	రూ.20.04 కోట్లు
కంతనపల్లి (జీఎల్ఎస్):	రూ.20.00 కోట్లు
చిన్న కాళేశ్వరం:	రూ.200.00 కోట్లు
కంతనపల్లి ప్రాజెక్టు (నిర్వహణ):	రూ.30,05 కోట్లు
దేవాదుల (ఏఐబీపీ) ప్రాజెక్టు:	రూ.43.50 కోట్లు
ఎస్ఆర్ఎస్పి స్టేజ్ 2 (ఏఐబీపీ) :	రూ.25.00 కోట్లు
దేవాదుల (ఏఐబీపీ) :	రూ.14.50 కోట్లు
ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 (ఏఐబీపీ) :	రూ.9.00 కోట్లు
పాకాల సరస్సు (జీఎల్ఐఎస్):	రూ.5.00 కోట్లు
రామప్ప సరస్సు (జీఎల్ఐఎస్) :	రూ.5.00 కోట్లు
మల్లూరు వాగు (ఎస్ఆర్ఎస్పీ-1):	రూ.1.00 కోట్లు
వట్టివాగు (ఎస్ఆర్ఎస్పి -1):	రూ.25.90 కోట్లు
లక్నవరం (జీఎల్ఐఎస్):	రూ.2.00 కోట్లు
ఘనపూర్ సిస్టం (ఫతేపూర్-పాపన్నపేట కాలువ):	రూ.57.00 కోట్లు
ఎల్‌టీ బయ్యారం:	రూ.1.00 కోట్లు
వరంగల్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్స్:	రూ.16.53 కోట్లు
కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ:	రూ.2.00 కోట్లు
వరంగల్ కార్పొరేషన్:	రూ.50.00 కోట్లు
వరంగల్ స్మార్ట్ సిటీ (మ్యాచింగ్ గ్రాంట్):	రూ.14.34 కోట్లు
వరంగల్ స్మార్ట్ సిటీ పనులు:	రూ.15.60 కోట్లు
మేడారం జాతర మిగులు పనులు:	రూ.52.95 కోట్లు
వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో భవనాలు:	రూ.10.00 కోట్లు

ప్రతిష్ఠాత్మకంగా ఆరు గ్యారంటీల అమలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు బడ్జెట్‌లో అధిక మొత్తంలో నిధులను కేటాయించారు. ఈ పథకాలతో ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 6.47లక్షల మంది ప్రయోజనం పొందుతున్నారు. ఇక ప్రతీ నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని ప్రకటించిన క్రమంలో ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలకు గాను 43వేల పైచిలుకు ఇళ్ల నిర్మాణం జరుగనున్నది. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున, ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు రూ.6లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నారు.

కేయూకు మహర్దశ



విశ్వవిద్యాలయాలకు త్వరలోనే పూర్తికాలపు వైస్‌చాన్సలర్‌ను నియమిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో సదుపాయాల కల్పనకు రూ.500కోట్లను ప్రతిపాదించారు. ఇందులో రూ.100 కోట్లు ఓయూకు, మరో రూ.100 కోట్లు మహిళా వర్సిటీకి కేటాయించారు. మిగతా నిధులు కాకతీయ విశ్వవిద్యాలయానికి, ఇతర వర్సిటీలకు ఖర్చు చేస్తారు. ఈ లెక్కన మిగిలిన నిధుల్లో సుమారు రూ.50కోట్ల నుంచి రూ.75కోట్ల వరకు కాకతీయ వర్సిటీకి వచ్చే అవకాశమున్నట్టు అంచనా వేస్తున్నారు.

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

- అటవీ, దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్‌సిటీ, జూలై 25: సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నవారు హుందాగా వ్యవహరించాలని, ప్రభుత్వ వ్యవస్థల్లో ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని అటవీ, దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఆలిండియా సర్వీసుల్లో వికలాంగుల కోటాపై తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. దివ్యాంగులపై స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారహిత్యంగా ఉన్నాయన్నారు. ఉన్నతమైన స్థానంలో ఉండి పర్యవసనాలను ఆలోచించకుండా మాట్లాడడం తగదని సూచించారు. తమ మాటల ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం వెళ్తుందో దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. శారీరక సామర్థ్యం కంటే మానసిక సామర్థ్యం ముఖ్యమని స్మితా సబర్వాల్ గుర్తించాలన్నారు. గొప్ప సంకల్పబలంతో శారీరక దుర్బలత్వాన్ని జయించి ఈ ప్రపంచానికి స్ఫూర్తిదాతలుగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తులు ఎందరో ఉన్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ ప్రభుత్వంలో వివక్షకు తావులేదని, అన్ని వర్గాల హక్కులకు రక్షణ ఉంటుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు

వరంగల్ కలెక్టరేట్, జూలై 25: ప్రజల సౌకర్యార్థ కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సత్య శారద తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సేవా కేంద్రంలో స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పట్టణాలు, మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే వారి కోసం ఇక్కడ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఇందులో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి, లబ్ధిపొందని వారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సేవా కేంద్రంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందుతాయని తెలిపారు. కొత్తగా దరఖాస్తు, వివరాల సవరణల కోసం వచ్చే వారు తమ వెంట ఆధార్‌కార్డు, విద్యుత్ సర్వీస్ నెంబర్, గ్యాస్ కనెక్షన్ నెంబర్, ఎల్‌పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నెంబర్ తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.



ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నిబంధనల మేరకే అనుమతులు

గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ వరంగల్ జిల్లా పరిధిలోని లే అవుట్ అనుమతుల కోసం కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన జిల్లా లే అవుట్ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని పైడిపల్లి, రంగశాయిపేట, బొల్లికుంట ప్రాంతాలలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ లే అవుట్ అనుమతుల కోసం ప్రతిపాదనలు వచ్చాయి. వాటి పై కమిటీ చర్చించి నిబంధనల మేరకు ఉన్నందున కమిటీ అనుమతులు మంజూరు చేసింది. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సిటీ ప్లానర్ వెంకన్న, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇజ్జగిరి, జిల్లా రోడ్లు భవనాల అధికారి జితేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈ సునీత, ఏపీవో రవీందర్, టీపీఓలు బషీర్, సుష్మా పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వరంగల్‌కు మిగిలింది గాడిద గుడ్డే

- రాష్ట్ర పద్దులో మొండిచేయి
- జిల్లాకు నిధులు తీసుకురాని మంత్రులు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- వరంగల్ హెడ్ పోస్టాఫీస్ చౌరస్తాలో ధర్నా రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

మిల్స్‌కాలనీ(వరంగల్), జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వరంగల్ జిల్లాకు గాడిద గుడ్డే మిగిలిందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ గురువారం వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ... తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంగడి పోయి గొంగడి కొన్నట్టు ఉందని వ్యంగ్యమాడారు. వరి మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనసంటూ వరంగల్‌లో రైతు డిక్లరేషన్ చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బడ్జెట్‌లో రైతులను మోసం చేసిందన్నారు. సన్నాలకే బోనసంటూ ఇప్పుడు మడతపేచీ పెడుతోందని ఆరోపించారు. ప్రతీ పంటకు అదనపు బోనస్ ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన కాంగ్రెస్ రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. ఆరు గ్యారెంటీలు అటకెక్కాయన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన మోసకారి కాంగ్రెస్ బండారం బడ్జెట్‌తో మరింత బట్టబయలు అయ్యిందన్నారు. వరంగల్‌కు మొండి చేయి చూపించినా జిల్లాలోని ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు విప్పడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో కొంత మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. మిగతా వారికి ఎప్పుడు మాఫీ చేస్తారని రవికుమార్ ప్రశ్నించారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు తగిన నిధుల ఊసే లేదని, బడ్జెట్‌లో కేటాయింపులకు ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందో లెక్కా పత్రం లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాణాప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల రఘునారెడ్డి, కాసు శిల్ప, ప్రధానకార్యదర్శి బాకం హరిశంకర్, కార్యదర్శి గడల కుమార్, సుమన్‌ఖత్రి, కిసాన్ మోర్చా నాయకులు సాంబయ్యయాదవ్, ఎస్సీ మోర్చా నాయకులు మాదాసు రాజు, నాయకులు చిలువేరు రాజేందర్, కూచన క్రాంతి కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏనుమాముల మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ సిటీ, జూలై 25: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ కమిటీ కార్యదర్శి పోలెపాక నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వారాంతపు యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం బోనాల పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం సెలవు ప్రకటించిందని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని కార్యదర్శి ఆ ప్రకటనలో కోరారు.

అసెంబ్లీలో మన ఎమ్మెల్యేలు

ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం శాసనసభలో 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సమావేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.


మంత్రి కొండా సురేఖ


దొంతి మాధవరెడ్డి


రేవూరి ప్రకాశ్‌రెడ్డి


కేఆర్ నాగరాజు


నాయిని రాజేందర్ రెడ్డి

నేడు కార్గిల్ విజయ్ దివస్

హాజరుకానున్న అమర జవాన్ల కుటుంబాలు ● మరిపెడలో ఏర్పాట్లు పూర్తి


మరిపెడలోని కార్గిల్ విజయ స్తూపం

మరిపెడ, జూలై 25: విద్రోహశక్తుల నుంచి పొంచిఉన్న ముప్పును రాత్రనకా, పగలనకా ఎముకలు కొరికే చలిలో నిద్రాహారాలు లేకుండా దేశరక్షణ కోసం శత్రుమూకల కదలికలను పసిక డుతూ భారత్‌ను కాపాడడానికి వారి ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకొని సైనికులు రక్షిస్తున్నారు. శత్రుమూకల దొంగదెబ్బకు బలియైనోళ్లు ఎందరో ఉన్నారు. వారే మనవీర సైనికులు. పాకిస్తాన్-ఇండియాకు 1999-2001 మధ్య జరిగిన కార్గిల్ యుద్ధం ఈ తరం ప్రజలకు తెల్సిందే! ఈ అమరులైన జవాన్ల జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం ఏటా జూలై 26వ తేదీని కార్గిల్ విజయ్ దివస్‌గా ప్రకటించింది.

మరిపెడలో యుద్ధ వీరుల స్తూపం

కార్గిల్ యుద్ధవీరుల సంస్మరణార్థం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్ కేంద్రంలో కార్గిల్ స్థూపాన్ని 'కార్గిల్ ట్రస్ట్' ద్వారా చిల్లం చర్లకు చెందిన గాదె రాంబాబు నిర్మించారు. ఆ యుద్ధంలో అమరుడైన వీరజవాన్ పద్మపాణి ఆచార్య తల్లి విమలాచార్య, అప్పటి మంత్రి రెడ్యానాయక్ 2004 జూలై 23న ఆవిష్కరించారు. నాటి నుంచి ఏటా కార్గిల్ విజయ్ దివస్‌ను మరిపెడలో నిర్వహిస్తున్నారు.

ఉమ్మడిజిల్లాకు చెందిన వీరులు వీరే..

కార్గిల్ యుద్ధంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఐదుగురు జవాన్లు వీరమరణం పొందారు. మరొకరు అంగవైకల్యంతో ఉన్నారు. వర్ధన్నపేట మండలం కరాడిగూడెంకు చెందిన పి.దేవేందర్‌రెడ్డి, కరీమాబాద్ వాసి మాడి శెట్టి సతీశ్, స్టేషన్‌ఘన్‌పూర్ చంద్రశేఖర్, డోర్నకల్ మండలం ఉయ్యాలవాడకు చెందిన బానోత్ లచ్చిరాంనాయక్ వీర మరణం పొందగా, కాజీపేటకు చెందిన గాదె కశ్యప్‌రెడ్డి రెండు కాళ్లు పోగొట్టుకున్నారు.

ఏర్పాట్లు పూర్తి

మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని కార్గిల్ స్థూపం దగ్గర శుక్రవారం కార్గిల్ విజయ్‌దివస్‌ను ఘనంగా నిర్వహించడానికి కార్గిల్ సోల్జర్స్ ట్రస్ట్ నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ వేడుకలకు ప్రజాప్రతి నిధులతో పాటు మాజీ సైనిక కుటుంబాలు, విద్యార్థులు, యువత పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'బైపాస్ సర్జరీ' ఉద్యోగి బదిలీ రద్దు

ఆంధ్రజ్యోతి కథనంతో బల్దియా అధికారుల్లో చలనం

ఉత్తర్వులు జారీ చేసిన ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్

వరంగల్ కార్పొరేషన్, జూలై 25: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన బదిలీలలో అధికారులు చేసిన డొల్లతనం బట్టబయలైంది. బల్దియా, ఆర్‌డీఎంఏ కార్యాలయంలో పని చేస్తున్న కొందరు అధికారులు ఒకరికి బదులు మరొకరిని, అందులో స్పౌజ్ అర్హతతో పాటు బైపాస్ సర్జరీ చేసుకున్న సీనియర్ అసిస్టెంట్‌ను బదిలీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'బల్దియా బదిలీల్లో అవకతవకలు' అనే శీర్షికన వార్తాకథనం ప్రచురితమైంది. దీనిపై బల్దియా అధికారులతో పాటు హైదరాబాద్ ఇన్‌చార్జి సీడీఎంఏ గౌతమ్ స్పందించినట్లు తెలిసింది. బల్దియా బదిలీలలో జరిగిన లొసుగులపై పూర్తి విచారణ చేపట్టి బాధితుడికి న్యాయం చేయాలని ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో బల్దియా అధికారులు సీనియర్ అసిస్టెంట్లు ఎంత మంది బదిలీకి ఆప్షన్ పెట్టుకున్నారు? ఎవరు అర్హులు? ఎందుకు తప్పు జరిగింది? అని పునరాలోచించుకున్నట్లు తెలిసింది. అన్ని కోణాల్లో నుంచి సమాచారం సేకరించిన తర్వాత ఒక కొలిక్కి వచ్చారు. వరంగల్ బల్దియా కాశిబుగ్గ సర్కిల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఖమ్మం మున్సిపాలిటీకి బదిలీ చేయబడ్డ ఈసంపెల్లి ఇజ్రాయెల్ బదిలీ ఆర్డర్‌ను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే దరఖాస్తు చేసుకున్న 22 మంది సీనియర్ అసిస్టెంట్లలో బదిలీకి అర్హత జాబితాలో మొదటి పేరు గల బొట్ల రమేష్‌ను ఖమ్మంకు బదిలీ చేస్తూ ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్ సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇజ్రాయెల్‌ను కార్యాలయానికి పిలిపించి రిటైన్డ్ ఎట్ డబ్ల్యూఎంసీ ఆర్డర్ పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆంధ్రజ్యోతికి ఇజ్రాయెల్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆప్షన్ పెట్టుకున్న ప్రకారమే బదిలీ

సీనియర్ అసిస్టెంట్లు పెట్టుకున్న ఆప్షన్ ప్రకారం బదిలీల ప్రక్రియ జరిగిందని, బదిలీలలో అవకతవకలు జరగలేదని ఆర్‌డీఎంఏ కార్యాలయం సిబ్బంది వివరణ ఇచ్చారు. సీనియర్ అసిస్టెంట్ ఇజ్రాయెల్ జీడబ్ల్యూఎంసీ, నర్సంపేట, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెంకు వెళ్లేందుకు ప్రాధాన్యతను బట్టి దరఖాస్తు చేసుకున్నాడని, 4వ జోన్‌లో ముందు వరసలో బొట్ల రమేష్, జి.దేవరాజ్, ఇమ్మడి ఇజ్రాయెల్, ఎం.సుధాకర్ (ఖమ్మం) ఉద్యోగులు ఉన్నారన్నారు. వీరిలో ఆప్షన్‌లో పేర్కొన్న ప్రకారం బదిలీ చేశామన్నారు. అయితే ముందుగా కొత్తగూడెంలో పని చేస్తున్న సుధాకర్ అనే ఉద్యోగికి మహబూబాబాద్‌కు, ఇజ్రాయెల్‌ను ఖమ్మంకు బదిలీ చేశామన్నారు. పైనుంచి ఆదేశాలు అందడంతో మొదటి స్థానంలో సీనియారిటీ ప్రకారం ఇజ్రాయెల్ బదిలీని రద్దు చేస్తూ బొట్ల రమేష్‌ను ఖమ్మంకు బదిలీ చేస్తూ సవరణ ఉత్తర్వులు జారీ చేసినట్టు అధికారులు వెల్లడించారు.

నేడు, రేపు ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 25: హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం నేడు, రేపు స్పాట్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీవో ఎస్.విద్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 విద్యా సంవత్సరంలో రెగ్యులర్‌గా పాసైన విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందని ఆమె తెలిపారు. బాలికల ప్రవేశాల కోసం శుక్రవారం మడికొండలోని బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే బాలుర ప్రవేశాల కోసం శనివారం మడికొండలోని బాలుర కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు వారి ధృవపత్రాల జిరాక్స్ కాపీలతో ఉదయం 8 గంటలకల్లా కళాశాలలో ఉండాలని తెలిపారు. గతంలో ఆర్‌సీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు స్పాట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని ఆమె తెలిపారు.

రుణాల రికవరీపై దృష్టి పెట్టండి : మార్నేని


మాట్లాడుతున్న చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 25: డీసీసీ బ్యాంకు పరిధిలోని రుణాల రివకరీపై దృష్టి పెట్టాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో లోక్ పాలసీ మేకింగ్ కమిటీ, డిస్ట్రిక్ లెవెల్ మానిటరింగ్ అండ్ రివ్యూ కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. రుణాల మంజూరు, రికవరీ, విద్యా రుణాలు, బంగారు ఆభరణాల రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, డిపాజిట్లు తదితర అంశాలపై రవీందర్‌రావు సమీక్ష జరిపి అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీసీసీ బ్యాంకు వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు జగన్‌మోహన్, చాపల యాదగిరి, మురళీ, డీసీవో నాగేశ్వరరావు, సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషా, టెస్కాబ్ నోడల్ ఆఫీసర్ లత, నాబార్డు డీడీయం చంద్రశేఖర్ తదితర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

7

ఆంధ్రజ్యోతి నవ్య నివేదన

శుక్రవారం • 26 జూలై 2024

చింతన

మనిషి జన్మకు పరమార్థం ఏమిటన్నది చిరకాల ప్రశ్న. సమాధానాలు అనేకం ఉన్నా, 'ముక్తి సాధన' అనేది ఏ ఒక్కరూ కాదనలేనిది. దీనికి మరో పేరు 'మోక్ష ప్రాప్తి'. జనన, మరణ బంధం నుంచి విమోచన పొందడం అన్నమాట. అంటే, ఆ చక్రం నుంచే బయటపడటం. ఇది మాటలు, రాతలు కాదు... చేతలతోనే సాధ్యమవుతుంది. దీనికి ఏకైక మార్గం... ప్రతీ వ్యక్తి ఆత్మజ్ఞానం కలిగి ఉండడమే. ఎవరి గురించి వారు తెలుసుకోవాలంటే దైవశక్తినే సాధనంగా భావించాలి. తెలుసుకునే క్రమంలో మన ముందు నాలుగు మార్గాలు కనిపిస్తాయి.. అవన్నీ 'గ'కారంతో మొదలయ్యేవే. అంటే... 'గ'కార చతుష్టయం. అవి: గీత, గంగానది, గాయత్రీ మంత్రం, గోవింద నామం. నిత్యజీవితంలో వీటి స్మరణ మానవ జీవితానికి సార్థకత కలిగిస్తుందని భారతీయ సంస్కృతిని చాటి చెబుతోంది. అదే విషయాన్ని 'ఆత్మ నివేదనం' పేరిట విపులీకరిస్తోంది. 'నివేదన' అంటే 'సమర్పణ' అని అర్థం. మనసును, వాక్కును, కర్మను కేంద్రీకరించడం. ఈ కేంద్రీకరణ ద్వారానే స్వీయ పరిశీలన వేగవంతమవుతుంది.



ముక్తి సాధన కోసం... గకార చతుష్టయం

చతుర్వేదాల సారాంశం

'గ'కార చతుష్టయంలో మొదటిది భగవద్గీత. ఇందులో ఉన్నదంతా వేద విజ్ఞాన సారం. వేదాలు నాలుగు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వ వేదం. 'వేదం' అనేది 'విద్' (తెలియడం) నుంచి ఏర్పడింది.

ఋగ్వేదం అంటే దేవ వేదమే. ఇందులోని కొన్ని సూక్తాలు పురాణాలను, సామాజిక వర్తనను వివరిస్తాయి. యజుర్వేదం యజ్ఞ నిర్వహణ రీతిని తెలుపుతుంది. మధురతకు సూచిక సామ వేదం. అంతేకాక, సకల జ్ఞాన ప్రదాయని. అథర్వ(ణ) వేదం ఆ ఋషి పేరు మీదుగా వచ్చింది. ఇందులోనూ శాస్త్రీయ పరిజ్ఞాన వైభవం కనిపిస్తుంటుంది. చతుర్వేదాల సారాంశ సమాహారం కాబట్టే.. భగవద్గీతకు అంతటి ప్రసిద్ధి, విశిష్టత కలిగాయి.

వేదమాత

గాయత్రీదేవి వేదమాతగా ప్రశస్తి అందుకుంది. 'గయలు' అంటే ప్రాణాలు. 'త్రాయతే' అనే పదానికి పరిరక్షణ అని అర్థం. అందుకే ప్రాణ సంరక్షకురాలుగా గాయత్రిని ఆరాధి



స్తారు. గాయత్రీ మంత్రంలోని "ఓం భూర్భువ స్సువః తత్సవితుర్వరేణ్యమ్'ను పరిశీలిస్తే... 'ఓం (సర్వ రక్షణ), భూ (ఉనికి), భువ (జ్ఞాన రూపం), స్వ (ఆనంద స్వరూపం), తత్ (అటువంటి లక్షణ సమన్విత పరమేశుడు), సవితు (విశ్వ కర్త) వరేణ్యం (సర్వులతో ఆరాధనీయులు)' అనే భావార్థాలు ఇమిడి ఉన్నాయి. ఇవన్నీ సంప్రదాయ పరంగా, శాస్త్రీయంగా కూడా ప్రామాణికాలు.



అనంత ఫలప్రదం

ఇక గోవింద నామం... 'గకార చతుష్టయంలో దీని పాత్ర అనంతం. 'శ్రీనివాసా, శ్రీవేంకటేశా, నిత్య నిర్మలా, భక్త వత్సలా, దినకర తేజా' అని స్మరణలు చేస్తారు ఆరాధకులు. 'గోవింద' అంటే భూ పరిరక్షకుడు. వేదాల వల్ల ఘనతరుడనే అంతరార్థమూ ఉంది. గోవింద నామం అనంత ఫలప్రదం.

యోగవిద్యకు సంబంధించి సాధన చతుష్టయమనే మాట వినిపిస్తూ ఉంటుంది. వివేకంతో వ్యవహరించడం, యధాతథ స్థితిని గ్రహించగలగడం, సంపత్ లేదా సమతుల్యతను కోరుకోవడం, ఆత్మ జ్ఞాన ప్రాప్తికి పలు విధాలుగా ప్రయత్నించడం. ఇదంతా అభ్యాస సాధనాల క్రమం. వీటన్నిటి ఫలితంగా స్వయం పరిశీలన శక్తి విస్తారమవుతుంది. క్రమేణా ముక్తి ప్రాప్తికి మార్గం సులభతరంగా మారుతుంది.

మానసిక, నైతిక పరమోన్నత స్థితే ముక్తి. అంటే... వ్యక్తి తన సహజత్వాన్ని పొందగలగడం. దీనికి మూలాధారం ఆత్మ నివేదన. దైవం పట్ల పరిపూర్ణ ప్రేమను వ్యక్తపరచే రీతి. భక్తి మార్గాలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటికన్నా నివేదన విధానమే భగవంతుడిని, భక్తుడిని అనుసంధానిస్తుంది. పత్రం, పుష్పం, ఫలం, చివరికి నీటినైనా భక్తితో సమర్పిస్తే ప్రీతిగా స్వీకరిస్తానన్నది గీతాచార్యుడి మాట. నిజానికి మనిషి శరీరం ఆకు వంటిదే. రాలిపోతుందే తప్ప, శాశ్వతం కాదు. అందువల్ల పత్ర అర్చనకు ఆ వ్యక్తి సంసిద్ధం కావాలి. తన మనోవనంలోని మొగ్గను పుష్పంలా వికసింప చేయాలి. ఆ వికసిత పుష్పమే విజ్ఞాన ఫలంగా రూపాంతరం చెందడాన్ని సమర్పణగా వర్ణిస్తుంది మన భారతీయ ధార్మిక చింతన. పవిత్ర గీత, పావన గంగ, శక్తిదాయక గాయత్రి, స్ఫూర్తిప్రదాయ గోవింద స్మరణలకు మనసు మనం సమర్పించుకుంటేనే జీవితాలకు ధన్యత. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భక్తి జ్ఞాన కర్మ యోగాదులు చాటి చెబుతున్నది ఇటువంటి ఆత్మ సమర్పణ పద్ధతినే.

• జంధ్యాల శరత్‌బాబు
99483 45013

భువనపావని...

యమున, కృష్ణా, గోదావరి, కావేరి, సింధు, నర్మదలతో పాటు సప్త నదుల్లో ఒకటి గంగ. 'భువన పావని', 'అనంత వాహిని' అనేవి దాని నామాంతరాలు. మన సంస్కృతి, చరిత్ర, వ్యవస్థ అంతా గంగానదితో మమేకమై ఉంది. గంగమ్మ తల్లిగా, గంగా భవానీగా పిలిచేది అందుకే. గంగను నీటికి పర్యాయపదంగా మనం ఉపయోగిస్తాం.. గంగ మరెన్నో నదులతో కలసి మహా ప్రవాహంగా మారుతుంది. ఆ జల స్నానం భారతీయులకు పరమ పవిత్రం. గంగా, యమున, సరస్వతీ నదుల సంగమ స్థలాన (త్రివేణి) కుంభ మేళాలు ఏర్పాటవుతుంటాయి. అలహాబాద్ (ప్రయాగ)లో ఈ మహోత్సవం వచ్చే ఏడాది జనవరిలో మొదలవుతుంది. ఇంతటి మేటి విశిష్టత కారణంగా... గంగ విశ్వ విఖ్యాతి పొందింది.

సుభాషితం

సజ్జన లక్షణాలు

ప్రదానం ప్రచ్ఛన్నం గృహ ముపగతే సంభ్రమవిధిః
ప్రియంకృత్వా మౌనం సదసి కథనం చాప్యుపకృతేః
అనుత్సేకో లక్ష్మ్యాం నిరభిభవసారాః పరకథాః
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్



సజ్జనుల్లో సహజంగా ఉండే లక్షణాల గురించి 'నీతి శతకం'లో భర్తృహరి వివరించిన శ్లోకం ఇది. దీన్ని...

పొసగన్ దానము గుప్త మర్థి భవనంబు జేరుచో సంభ్రమో
ల్లసదుత్థానవిధానముం బ్రియవిధుల్ గావించి మౌనంబు రా
జసభన్ మిత్రకృత ప్రకాశనము గుత్సాకర్మ వైముఖ్య మీ
యసిధారావ్రతచర్య యెవ్వడు మహార్యశ్రేణికిం దెల్పెనో...

అంటూ ఏనుగు లక్ష్మణకవి సముచిత రీతిలో తెలుగువారికి సమర్పించాడు.

భావం: దానాలు చేస్తున్నానని చాటింపు వేసుకోకుండా రహస్యంగా చేయడం. ఇంటికి వచ్చి యాచించిన వారిని ఆదరించడం. వేరొకరికి తను చేసిన మేలు గురించి ప్రచారం చేసుకోకపోవడం, వేరొకరు తనకు చేసిన మేలును పదిమందికీ చెప్పడం, ఎన్ని సంపదలు వచ్చినా వినయంగా ఉండడం, పరుల గురించి చెడ్డగా మాట్లాడకపోవడం... వీటన్నిటినీ పాటించడం కత్తిమీద సాములాంటిది. ఈ గుణాలు ఎవరో బోధిస్తేనో, నేర్పితేనో రావు. సజ్జనుల్లో ఈ లక్షణాలు స్వతస్సిద్ధంగా ఉంటాయి.

సద్బోధ

యోగి- సాధువు

పూర్వం ఒక యోగి అకుంఠితమైన తపస్సు చేసి, కొన్ని గొప్ప శక్తులను సంపాదించాడు. అతను స్వతహాగా మంచివాడు. కానీ తన శక్తులంటే అతనికి గర్వం ఉండేది. వాటిని ప్రదర్శించాలనే కోరిక ఉండేది. ఆ గర్వాన్ని తగ్గించాలని దేవుడు అనుకున్నాడు. ఒక రోజు... సాధువు రూపంలో ఆ యోగి దగ్గరకు వచ్చాడు. "స్వామీ! మీకు అద్భుతమైన శక్తులు ఉన్నాయని విన్నాను. మిమ్మల్ని దర్శించుకోవాలని వచ్చాను" అని అన్నాడు. మాటలు విన్న యోగి ఉప్పొంగిపోయాడు. మునిని సాదరంగా ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చాడు.

ఈలోగా అటువైపు ఒక ఏనుగు వెళుతోంది. సాధువు దాన్ని చూపిస్తూ "స్వామీ! మీరు కోరుకుంటే ఆ ఏనుగును చంపగలరా?" అని అడిగాడు.

"ఎందుకు చంపలేను? ఇదిగో చూడండి" అంటూ నేల మీద పిడికెడు మట్టి తీసుకున్నాడు యోగి. దాన్ని మంత్రించి ఏనుగు మీదకు విసిరాడు. ఆ ఏనుగు నొప్పితో విలవిలలాడుతూ నేల మీద పడి మరణించింది.


'చూశావా!' అన్నట్టు గర్వంగా తలాడించాడు యోగి.

"మీ శక్తులు అమోఘం స్వామీ! మీరు ఏనుగును చంపేశారు. మరి దాన్ని మళ్ళీ బతికించగలరా?" అని అడిగాడు సాధువు.

"తప్పకుండా" అంటూ మరికాస్త మట్టి తీసుకొని, మంత్రించి, మరణించిన ఏనుగు మీద చల్లాడు యోగి. ఆ ఏనుగు లేచి నిలబడింది. శరీరానికి అంటుకున్న దుమ్మును విదిలించుకుంటూ అడవిలోకి నడిచింది.

"స్వామీ! మీకు అపారమైన శక్తులు ఉన్నాయి. కానీ నాకొక సందేహం ఉంది తీరుస్తారా?" అన్నాడు సాధువు.

"దానికేం? అడగండి" అన్నాడు యోగి.



"మీరు ఏనుగును చంపారు. దాన్ని మళ్ళీ బతికించారు. కానీ అందువల్ల మీకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఆధ్యాత్మికమైన ఉన్నతి కలిగిందా? మోక్షాన్ని, భగవంతుణ్ణి చేరే మార్గం దొరికిందా?" అని ప్రశ్నించాడు సాధువు.

ఆ మాటలకు యోగి దిగ్భ్రాంతి చెందాడు. సాధువు రూపంలో ఉన్న దేవుడు చిరునవ్వు నవ్వుతూ మాయమైపోయాడు. ఇంతసేపూ తన ముందు ఉన్నది సాక్షాత్తూ భగవంతుడేనని యోగికి అర్థమయింది. ఆ క్షణం నుంచి అతనిలో గర్వం, కోరికలు పూర్తిగా సమసిపోయాయి.

శ్రీ రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ "సూది బెజ్జానికి అడ్డుగా కంటికి కనిపించని చిన్న నలుసు ఉన్నా సరే... దానిలోంచి దారం వెళ్ళడం కష్టమవుతుంది. అదే విధంగా సాధకుల్లో ఇసుకరేణువంత కోరిక, గర్వం మిగిలి ఉన్నా... పరమాత్మ తత్వాన్ని గ్రహించలేరు. మోక్షపథాన్ని అందుకోలేరు" అని స్పష్టం చేశారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MNuqIkIలో చదవండి.

బిజినెస్

టెక్ మహీంద్రా లాభంలో 23% వృద్ధి

క్యూ1లో రూ.851 కోట్లుగా నమోదు.. రూ.13,005 కోట్లకు తగ్గిన ఆదాయం



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ) టెక్ మహీంద్రా రూ.851 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి గడించిన రూ.692.5 కోట్ల లాభంతో పోలిస్తే, ఈసారి 23 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.2 శాతం తగ్గి రూ.13,005 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గినప్పటికీ, మొత్తం వ్యయాలు 2.3 శాతం తగ్గి రూ.955 కోట్లకు పరిమితం కావడం, వడ్డీ ఖర్చులు 40 శాతం తగ్గి రూ.715 కోట్లకు దిగిరావడం లాభాల్లో మెరుగైన వృద్ధికి దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మరింత మెరుగైన పనితీరు కనబర్చనుందని టెక్ మహీంద్రా కొత్త ఎండీ, సీఈఓ మోహిత్ జోషి అన్నారు.

- సేవల వ్యయం తగ్గడంతో క్యూ1లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ మరో 1.9 శాతం పెరిగి 12 శాతంగా నమోదైంది. ఇకపై లాభాల మార్జిన్ క్రమంగా పుంజుకోనుందని మోహిత్ జోషి అన్నారు.
- గడిచిన మూడు నెలల్లో కంపెనీ 53.4 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్‌ను కుదుర్చుకుంది. అయితే, ఐటీ రంగం ఇంకా అనిశ్చితిలోనే కొనసాగుతోందని, ఈ మధ్యనే చేపట్టిన పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళిక కంపెనీకి దోహదపడుతోందని జోషి పేర్కొన్నారు.

6,000 మంది ఫ్రెషర్ల నియామకాలు

గత మూడు నెలల్లో టెక్ మహీంద్రా ఉద్యోగులు నికరంగా 2,165 మంది పెరిగారు. దాదాపు 1,000 మంది ఫ్రెషర్ల నియామకాలతో పాటు బీపీఓ విభాగంలో మరింత మందిని చేరుకున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలనుకుంటున్నట్లు కంపెనీ ఇదివరకే ప్రకటించింది.

ద్వితీయార్థంలో సిబ్బందికి వేతన పెంపు

తమ కంపెనీలో పనిచేస్తున్న 1.47 లక్షలకు పైగా ఉద్యోగులకు వేతనాన్ని పెంచాలనుకుంటున్నట్లు జోషీ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో (2024 అక్టోబరు-2025 మార్చి) పెంపు ఉంటుందని, ఇదే విషయాన్ని సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. ఐటీ రంగ కంపెనీలకు ఉద్యోగుల జీతాలే ప్రధాన వ్యయం.

పసిడి పడుతోంది..

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు వరుసగా మూడో రోజూ తగ్గుముఖం పట్టాయి.ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం మరో రూ.1,000 తగ్గి రూ.70,650 స్థాయికి జారుకుంది. కిలో వెండి ఏకంగా రూ.3,500 తగ్గడంతో ధర రూ.84,000కు దిగివచ్చింది. అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు దేశీయ బులియన్ మార్కెట్లోనూ జువెలర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. గడిచిన మూడు రోజుల్లో తులం బంగారం రూ.5,000 తగ్గింది. ఈ విలువైన లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని 6 శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడంతో ఈనెల 23న గోల్డ్ రేటు ఏకంగా రూ.3,350 పడిపోయి రూ.72,300 స్థాయికి జారుకుంది. ఈ ఏడాదిలో అదే అతిపెద్ద తగ్గుదల. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒక దశలో 42.20 డాలర్లు తగ్గి 2,421 డాలర్ల స్థాయిలో ట్రేడవగా.. సిల్వర్ 28 డాలర్ల స్థాయికి పడిపోయింది.

మెటల్, బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాలు చవిచూశాయి. గురువారం ట్రేడింగ్ ఆరంభంలోనే 671 పాయింట్ల వరకు క్షీణించి 79,500 దిగువ స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. మళ్లీ క్రమంగా తేరుకుని చివరికి 109.08 పాయింట్ల నష్టంతో 80,039.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 203 పాయింట్ల మేర పతనమై 24,200 స్థాయికి జారుకుంది. చివర్లో 7.40 పాయింట్ల నష్టంతో 24,406.10 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో ఇన్వెస్టర్లు లోహం, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. మూలధన లాభాలపై పన్ను పెంచడంతో విదేశీ ఇన్వెస్టర్లు మన ఈక్విటీల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.

30 నుంచి అకుమ్స్ డ్రగ్స్ ఐపీఓ: అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 30న ప్రారంభమై ఆగస్టు 1న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల బిడ్డింగ్ ధర శ్రేణిని కంపెనీ రూ.646-679గా నిర్ణయించింది. తద్వారా రూ.1,857 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది.

ఐపీఓకి స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.250 కోట్ల మొత్తానికి కొత్తగా రూ.10 ముఖ విలువతో కూడిన ఈక్విటీ షేర్లు జారీ చేయటం ద్వారా సమీకరించనుంది. మిగిలిన రూ.350 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా సమీకరించనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా 1.844 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు అవసరమైన స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ పరికరాల తయారీలో కంపెనీ కీలకంగా ఉంది.

సైయెంట్ లాభంలో 17శాతం క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో సైయెంట్ రూ.1,414 కోట్ల రెవెన్యూపై రూ.141 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 2.8 శాతం, లాభం 17 శాతం క్షీణించాయి. కరెన్సీ మారకం ప్రభావం జూన్ త్రైమాసిక ఫలితాలపై పడిందని, దీంతో డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) వ్యాపారం క్షీణించిందని కంపెనీ పేర్కొంది, జూన్ త్రైమాసికంలో 5.24 కోట్ల డాలర్ల విలువైన ఆర్డర్లను కంపెనీ చేజిక్కించుకుంది. ఈ ఆర్డర్ల కారణంగా రానున్న త్రైమాసికాల్లో నిలకడైన వృద్ధిని కనబరచవచ్చని భావిస్తున్నట్లు సైయెంట్ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో సెమీకండక్టర్ విభాగంలోకి కంపెనీ అడుగుపెట్టిందని, ఇందుకోసం ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

48 శాతం తగ్గిన లారస్ ల్యాబ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గాను లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ రూ.1,195 కోట్ల రెవెన్యూపై రూ.13 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 1 శాతం, లాభం 48 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో కీలకమైన సీడీఎంఓ క్లినికల్ ప్రాజెక్టుల్లో నిలకడైన పనితీరుతో పాటు అంకాలజీ ఏపీఐ, ఏఆర్‌వీ విభాగంలో పటిష్ఠమైన వృద్ధిని కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. ఈ కాలంలో కంపెనీ సీడీఎంఓ-సింథసిస్ వ్యాపారం రూ.214 కోట్లుగా ఉండగా ఏపీఐ రెవెన్యూ రూ.664 కోట్లుగా ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,820 ▼	64,000 ▼	89,000 ▼
ముంబై	68,227 ▼	62,496 ▼	81,474 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	విజయవాడ	104
వరంగల్	104	గుంటూరు	107
కరీంనగర్	104	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	120
కర్నూలు	104	నెల్లూరు	120
విశాఖపట్నం	93	అనంతపురం	104
గోదావరి	104		

మ్యాన్‌కైండ్ గూటికి బీఎస్‌వీ

- ఒప్పందం విలువ రూ.13,630 కోట్లు
- అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి కొనుగోలు



న్యూఢిల్లీ: భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్ (బీఎస్‌వీ)లో 100 శాతం వాటాను రూ.13,630 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మ్యాన్‌కైండ్ ఫార్మా గురువారం ప్రకటించింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి ఈ కంపెనీని చేజిక్కించుకుంది. బీఎస్‌వీ కోసం ఈక్వ్యాటీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) కన్సార్షియం కూడా పోటీ పడినప్పటికీ అధిక ధరకు బిడ్డింగ్ వేయడం ద్వారా మ్యాన్‌కైండ్ ఈ సంస్థను హస్తగతం చేసుకుంది. బీఎస్‌వీ కొనుగోలు మ్యాన్‌కైండ్ వ్యాపారాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లనుంది. మహిళల ఆరోగ్యం, సంతాన సాఫల్య ఔషధాల మార్కెట్లో అగ్రగామిగా నిలపనుంది. అలాగే, క్రిటికల్ కేర్‌లో ఇతర ఉత్పత్తుల్లోకీ ప్రవేశం కల్పించనుంది. బయోఫార్మాస్యూటికల్స్‌లో ఐదు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన బీఎస్‌వీ.. మహిళ ఆర్యోగానికి సంబంధించి సంతాన సాఫల్యం నుంచి ప్రసవం తర్వాత సంరక్షణలో ఉపయోగించే పలు సంక్లిష్ట ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది. "మ్యాన్‌కైండ్ ప్రయాణంలో బీఎస్‌వీ కొనుగోలు కీలక మైలురాయి. మహిళల ఆరోగ్యం, ఫెర్టిలిటీ మార్కెట్లో తమను అగ్రసంస్థగా నిలబెడుతుంది. భవిష్యత్‌లో ఈ విభాగం అపార అవకాశాలు అందించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా బలమైన వ్యాపార వృద్ధికి బాటలు వేయనుందని భావిస్తున్నా"మని మ్యాన్‌కైండ్ ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ రాజీవ్ జునేజా అన్నారు.

పిట్టీ ఇంజనీరింగ్ చేతికి దక్షిణ్ ఫౌండ్రీ

డీల్ విలువ రూ.153 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ (డీఎఫ్‌పీఎల్)లో 100 శాతం వాటాలను రూ.153.12 కోట్లకు కొనుగోలు చేసినట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. డీఎఫ్‌పీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న పదిహేను రోజుల్లో ఈ డీల్‌ను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి డీఎఫ్‌పీఎల్ వద్ద రూ.42.71 కోట్ల నగదు, బ్యాంక్ బ్యాలెన్స్ ఉంది. డక్టైల్ ఐరన్, గ్రే ఐరన్, లో కార్బన్ అల్లాయ్ స్టీల్ గ్రేడ్స్, సిమో ఐరన్ కాస్టింగ్స్ తయారీలో డీఎఫ్‌పీఎల్ కీలకంగా ఉంది. బెంగళూరు, హోస్కోట్‌లో ఏటా 4,200 టన్నుల స్థాపిత సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లను నిర్వహిస్తోంది. డీఎఫ్‌పీఎల్ కొనుగోలుతో పిట్టీ ఇంజనీరింగ్ ఉత్పత్తి సామర్థ్యపరంగా మరింత బలోపేతం కానుందని సంస్థ ఎండీ అక్షయ్ ఎస్ పిట్టీ తెలిపారు.

స్థిరాస్తుల అమ్మకాల లాభాలపై కొత్త కొర్రీ

- వడ్డీ, స్టాంప్ డ్యూటీలు ఖర్చులు యథాతథం

న్యూఢిల్లీ: స్థిరాస్తుల అమ్మకాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) తగ్గించామని చెబుతూనే.. ప్రభుత్వం పెద్ద బాంబు పేల్చింది. ఈ లాభాల లెక్కింపు కోసం ఆస్తుల కనీస విలువను లెక్కించేటప్పుడు, వాటిని కొనేటప్పుడు చెల్లించే స్టాంప్ డ్యూటీ, అప్పు చేసి కొంటే.. ఆ అప్పులపై చెల్లించే వడ్డీల భారం.. ప్రస్తుతం ఉన్న విధంగానే లెక్కింపులోకి రాదని స్పష్టం చేసింది. కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా గురువారం ఈ విషయం వెల్లడించారు. కొత్త ఎల్‌టీసీజీటీ విధానంలోనూ ఇదే పద్ధతి కొనసాగుతుందన్నారు. దీంతో ద్రవ్యోల్బణం ఆధారంగా లెక్కించే ఇండెక్సేషన్ ఖర్చుల ప్రయోజనం రద్దయి, స్థిరాస్తుల దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను భారం 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గినా అమ్మకందారులకు పెద్దగా ప్రయోజనం లేదని భావిస్తున్నారు.

కెనరా బ్యాంక్ లాభం రూ.3,905 కోట్లు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ ముగిసిన త్రైమాసికంలో రూ.3,905 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,535 కోట్లతో పోల్చితే లాభం 10 శాతం పెరిగింది. మొండి బకాయిలు తగ్గడం ఇందుకు దోహదపడింది. కాగా బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.29,823 కోట్ల నుంచి రూ.34,020 కోట్లకు పెరిగింది. వడ్డీల ద్వారా జూన్ త్రైమాసికంలో రూ.28,701 కోట్లు ఆదాయం లభించింది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.8,666 కోట్ల నుంచి రూ.9,166 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 3.05 శాతం నుంచి 2.90 శాతానికి తగ్గింది. భవిష్యత్తులో ఎన్ఐఎం మెరుగుపడి 2.95 శాతం వద్ద స్థిరపడుతుందని భావిస్తున్నట్లు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు చెప్పారు. ఆస్తుల నాణ్యత విషయానికి వస్తే బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5.15 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 1.57 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.2,418 కోట్ల నుంచి రూ.2,171 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ సీఆర్ఏఆర్ (క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి) 16.28 శాతానికి పెరిగింది. ప్రొవిజన్ కవరేజి నిష్పత్తి (పీసీఆర్) 118 బేసిస్ పాయింట్లు పెరిగి 89.22 శాతానికి చేరింది. ఈ ఏడాది చివరికి పీసీఆర్ 90 శాతం దాటాలని బ్యాంక్ భావిస్తున్నదని రాజు చెప్పారు. ప్రతి త్రైమాసికంలోనూ రూ.1,000 కోట్లు మొండి బకాయిలు వసూలు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు.

రూ.8,500 కోట్ల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.8,500 కోట్ల నిధులు సమీకరించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని ఎండీ తెలిపారు. టియర్ 1, టియర్ 2 బాండ్ల ద్వారా ఈ నిధులు సమీకరిస్తామన్నారు. అలాగే తమ అనుబంధ సంస్థలు కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, కెనరా రొబెకో ఏఎంసీ రెండింటిలోనూ 25 శాతం వంతున వాటాలు విక్రయించాలని నిర్ణయించినట్లు రాజు వెల్లడించారు.



డ్రంకెన్ డ్రైవ్‌తో జరిమానా

మట్టెవాడ, జూలై 25: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 16 మంది వాహనదారులకు గురువారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 16 మంది వాహనదారులకు రూ. 24,400 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన వాహనదారునికి రూ. 1,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

రెస్టారెంట్‌లో తనిఖీలు

శంభునిపేట, జూలై 25 : నాణ్యత ప్రమాణాలు పాటించటం లేదని నక్కలపల్లిలోని ఓ రెస్టారెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. 43వ డివిజన్ నక్కలపల్లిలోని బార్ అండ్ రెస్టారెంట్‌పై బుధవారం రాత్రి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. వంట గదిలో శుభ్రత పాటించటం లేదని, ఆహార పదార్థాల తయారీలో నిబంధనలు పాటించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెస్టారెంట్ యజమానికి నోటీసులు ఇచ్చారు.



కార్గిల్ విజయ దివస్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, బీజేవైఎం నేతలు

కార్గిల్ విజయ దివస్ ర్యాలీ

మిల్స్‌కాలనీ, జూలై 25: బీజేవైఎం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్ ర్యాలీని గురువారం నిర్వహించారు. వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నామని మహేశ్‌లు మాట్లాడుతూ భారత సైన్యం పాకిస్తాన్‌పై విజయం సాధించిన దానికి గుర్తుగా విజయ దివాస్ నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిలుసాని సోమేశ్వర్ వర్మ, వై.భరత్‌వీర్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, వన్నాల వెంకటరమణ, కార్పొరేటర్లు గండె కల్పన నవీన్, జలగం అనిత రంజిత్, ఆడెపు స్వప్న, నాయకులు వీరమాత, మాడిశెట్టి సుజాత, బాకం హరిశంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గిర్మాజీపేట, జూలై 25 : బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించని కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎంసీపీఐ(యు) గురువారం వరంగల్ నగరంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసింది. జిల్లా శాఖ కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేంద్ర దిష్టిబొమ్మను దహనం చేశారు. రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఎనిమిది మంది బీజేపీ అభ్యర్థులను లోకసభ సభ్యులను గెలిపిస్తే బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లా అభివృద్ధికి కీలకమైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, కాకతీయ టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి నిధులు అంశం ప్రస్తావించకపోవడం కేంద్ర ప్రభుత్వానికి జిల్లా అభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధిని తెలియచేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు గోనే కుమారస్వామి, మంద రవి, నాగెల్లి కొయురయ్య, వరంగల్ నగర కార్యదర్శి జగదీశ్వర్, కె.కుమారస్వామి, మహ్మద్ ఇస్మాయిల్, నగేష్, సోమిడి రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం.. వ్యాధుల విహారం

అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

రోగులతో నిండుతున్న ఆస్పత్రులు

వృద్ధులు, పిల్లలు, గర్భిణులు జాగ్రత్త...


కరీమాబాద్, జూలై 25: వానాకాలం వచ్చిందే సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయి. వాతావరణంలో మార్పుల కారణంగా దగ్గు, జలుబు, జ్వరం, వాంతులు, విరేచనాలు, ఒంటినొప్పులు, తలనొప్పి, గొంతునొప్పి, తదితర సమస్యలను ఎదుర్కొంటున్నారు. వైరల్ ఫీవర్, టైఫాయిడ్, వ్యాధులు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. కొద్దిరోజులుగా తలనొప్పి, గొంతునొప్పి, జ్వరాలతో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. పలువురు రోగాలబారిన పడడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వృద్ధులు పిల్లలు, గర్భిణులు, మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉష్ణోగ్రతను 97.7ఫారిన్‌హీట్ నుంచి 98.5 ఫారిన్‌హీట్ వరకు సాధారణంగా భావిస్తామని, కానీ ఈ తరహా వాతావరణంతో కొన్నిసార్లు 95 ఫారిన్‌హీట్ కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉండే అవకాశాలు ఉన్నాయని వైద్యులు తెలుపుతున్నారు. దీనివల్ల రోగులు వణకడం, గుండె స్పందనల్లో తేడాలు, పల్స్‌రేటు పడిపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, మల్టీ ఆర్గాన్స్ సమస్యలు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు.

రోగ నిరోధక శక్తి దెబ్బతిని..

వాతావరణంలో మార్పులతో రోగ నిరోధక శక్తి దెబ్బతింటుందని వైద్యులు తెలిపారు. వాతావరణంలో తేమ ఎక్కువగా కావడంతో బ్యాక్టీరియా, వైరస్ విజృంభిస్తాయని, రోటా వైరస్, ఈవో వైరస్, ఎంట్రిక్ వైరస్, వంటివి బలం పుంజుకుంటాయని దీంతో డయేరియా, శ్వాసకోశ వ్యాధులు, అతిసార వంటి వ్యాధుల బారిన పడుతారని చెబుతున్నారు. వర్షాకాలంలో శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు అనుకూలంగా ఉంటుందని, ఇన్‌ఫ్లూంజా వైరస్ బలం పుంజుకుంటుందని, తద్వారా న్యూమోనియా వచ్చే అవకాశం ఉంది. అస్తమా, క్రానిక్, బ్రాంకైటీస్ రోగులు తీవ్ర ఇబ్బంది పడతారని సూచిస్తున్నారు.



రోగులతో నిండిపోయిన ఎంజీఎం జనరల్ వార్డు



కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులతో బాధప డుతూ ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. దీంతో అటు ప్రైవేటు, ఇటు ప్రభుత్వ ఆస్పత్రులు రోగులు, వారి బంధువులతో నిండిపోతున్నాయి. తాజాగా ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలని ప్రభుత్వం భావించినా ఇంకా కార్య రూపం దాల్చలేదని తెలుస్తోంది. పీహెచ్‌సీ సెంటర్లు నిత్యం రోగులతో కిటకిటడుతున్నాయి.

గర్భిణులు అప్రమత్తం..

నీటి కాలుష్యంతో ఇన్‌ఫెక్షన్స్ ఎక్కువగా వస్తాయి. ముఖ్యంగా గర్భిణుల్లో డయేరియా వచ్చే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తలతోనే ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. మంచి వాతావరణం చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, గర్భిణులు మలేరియా రాకుండా జాగ్రత్త వహించాలి. మలేరియాతో తల్లి గర్భంలో ఉండే శిశువుపై కూడా ప్రభావం ఉంటుంది. ఈ కాలంలో విజృంభించే వైరస్‌లు కారణంగా దగ్గు, జలుబు, ఆయాసం వచ్చే అవకాశాలున్నాయి. అవసరం మేరకే మందులు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వీలైనంత వరకు పౌష్టికాహారం తీసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ వేములపల్లి నరేష్‌కుమార్, జనరల్ సర్జన్



వర్షాకాలంలో ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలి. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పరిసర ప్రాంతాల్లో నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకో వాలి. వేడిగా ఉండే ఆహార పదార్థా లను తీసుకోవాలి. తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

జాగ్రత్తలు పాటించండి..

- తేలికైన మంచి ఆహారం తీసుకోవాలి
- కొవ్వు ఆహారం, నాన్‌వేజ్‌కు దూరంగా ఉండాలి
- దగ్గు వస్తే మాస్క్, కర్చిఫ్‌ను ఉపయోగించాలి
- శుభ్రమైన నీటిని తాగాలి, నీటిని వేడి చేసుకొని తాగడం శ్రేయస్కరం
- పిల్లలకు దగ్గు, జలుబు జ్వరం వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- పండ్లు, కూరగాయలు, పాలు ఎక్కువగా తీసుకోవాలి.
- ఇంట్లో ఈగలు, దోమలు ముసరకుండా శుభ్రం చేసుకోవాలి
- స్కూల్ నుంచి ఇంటికి రాగానే గోరు వెచ్చటి నీటితో స్నానం చేయాలి
- వృద్ధులు చల్లటి వాతావరణంలో వాకింగ్ చేయకూడదు
- మధుమేహం, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడే వారు ముందుగా వ్యాక్సిన్ తీసుకోవాలి
- త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి
- వ్యాజిలీన్, క్రీం, పెట్రోలియం జెల్లి వంటి వాటిని వినియోగించాలి

ఐదుగురు డీఈఈల బదిలీ

వరంగల్ కార్పొరేషన్, జూలై 25: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న ఐదుగురు డీఈఈ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)లను బదిలీ చేస్తూ గురువారం రాష్ట్ర ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎమ్డీ జలాలుద్దీన్ ఉత్తర్వులు జారీ చేశారు.

చాలా కాలం ఒకే చోట పని చేయడంతో పాటు అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో బదిలీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇక్కడి బల్దియా పరిధిలో పనిచేస్తున్న వారిని ఇతర ప్రాంతాలకు ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిని వరంగల్ బల్దియాకు పోస్టింగ్ ఇస్తున్నట్టు తెలిపారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రదేశం
కె. శ్యాంమోహన్	పబ్లిక్ హెల్త్ క్వాలిటీ కంట్రోల్ వరంగల్	జీడబ్ల్యుఎంసీ
టి. రవికుమార్	జీడబ్ల్యుఎంసీ	పబ్లిక్ హెల్త్ క్వాలిటీ కంట్రోల్, వరంగల్
కె.ప్రవీణ్‌కుమార్	జీడబ్ల్యుఎంసీ	జీహెచ్ఎంసీ హైదరాబాద్
ఇజ్రత్ జహాన్	జీడబ్ల్యుఎంసీ	టీయూఎఫ్‌టీ యూనిట్ -3
ఎస్.సంజయ్‌కుమార్	జీడబ్ల్యుఎంసీ	జీహెచ్ఎంసీ హైదరాబాద్

ఏసీబీకి దొరికిన సబ్ రిజిస్ట్రార్



ఏసీబీకి పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ సునీత

పరకాల, జూలై 25: భూమిని కుమారుల పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయాలనుకున్న దంపతుల నుంచి లంచం డిమాండ్ చేసిన పరకాల సబ్ రిజిస్ట్రార్ సునీత ఏసీబీకి చిక్కారు. అధికారుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల మునిసిపాలిటీ పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన లడే రాజేశ్వర్‌రావు,సాంబలక్ష్మీ దంపతులకు చెందిన 1,173 గజాల భూమిని వారసత్వంగా తమ ఇద్దరు కుమారులు లడే శ్రీనివాస్, లడే శ్రీకాంత్‌లకు చెరిసగం గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు ఈ నెల మొదటివారంలో పరకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. కార్యాలయం సమీపంలో ఉండే డాక్యుమెంట్ రైటర్ బొట్ల నరేశ్‌ను సంప్రదించగా సబ్‌రిజిస్ట్రార్‌ను అడిగి చెబుతానని వెళ్లి అనంతరం రూ.80వేలు ఇస్తే రిజిస్ట్రేషన్ జరుగుతు ందని చెప్పారు. ఈ విషయంపై శ్రీనివాస్, శ్రీకాంత్ నేరుగా సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లి పలుమార్లు తమ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని కోరినప్పటికీ నరేశ్‌ను వెళ్లి కలవడంటూ దాటవేసేవారు. అంతే కాకుండా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సైతం ఈ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించినప్పటికీ చేస్తానని కాలయాపన చేశారు. దీంతో విసిగి వేసారిన శ్రీనివాస్, శ్రీకాంత్ ఈనెల 22న ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఏసీబీ అధికారుల సూచనల మేరకు వారు లంచం ఇస్తామంటూ ఒప్పందం కుదుర్చుకుని రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నారు. ఆ స్లాట్ ప్రకారం గురువారం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా.. ఈ క్రమంలో లంచంగా ఇస్తామని చెప్పిన రూ.80వేలను డాక్యుమెంట్ రైటర్ నరేశ్‌కు ఇచ్చారు. వెంటనే నరేశ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని విచారించగా సబ్‌రిజిస్ట్రార్ ఆదేశాలతో లంచం తీసుకున్నట్లు ఒప్పుకోవడంతో వెంటనే సబ్‌రిజిస్ట్రార్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు తీసుకున్న ట్లయితే 1064 లేదా 91543 88912కు కాల్ చేసి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సీఐలు శ్యాం, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

వరంగల్ చౌరస్తా, జూలై 25: కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ నందిరాం నాయక్ అన్నారు. గురువారం కాశిబుగ్గ వివేకాందన కాలనీ రోడ్డు నంబర్ 1లో నిర్వహించిన కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి పెట్టాలని, డ్రగ్స్‌కు బానిసలు కాకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరాలు ఎక్కువగా నమోదవుతుండడంతో తగు జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఇంతేజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులు ఆందోళన చెందవద్దు'



కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న గౌస్‌హైదర్

గీసుగొండ, జూలై 25: రుణమాఫీకి అర్హులై ఉండి మాఫీ లిస్ట్‌లో పేరు రాని రైతులు ఆందోళన చెందవద్దని ఏడీఏ గౌస్‌హైదర్ కోరారు. మండల వ్యవసాయ కార్యాలయంలో రూ.లక్ష రుణమాఫీ కాని రైతులతో గురువారం మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ కొంతమందికి సాంకేతిక కారణాల జాబితాలో పేరు రాలేదని గుర్తించినట్లు చెప్పారు. పేర్లు రాని వారు ఏఈవోలకు రుణం పొందిన వివరాలతోపాటు ఆధార్‌కార్డు, భూమి పాస్‌బుక్‌లను అందచేయాలని కోరారు. అనంతరం గీసుగొండ యూబీఐ బ్యాంకులో జరుగుతున్న రుణమాఫీ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఏవో హరిప్రసాద్ బాబు, ఏఈవోలు కావ్య, రజిని,విజయ్, అబిద్‌హుస్సేన్, అఖిల పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్లో వనమహోత్సవం

వరంగల్ వ్యవసాయం, జూలై 25: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వన మహోత్సవంలో భాగంగా గురువారం ఆ మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మార్కెట్ కమిటీ ఉద్యోగులు, సిబ్బంది అందరు కలిసి మార్కెట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ.. మొక్కలు పర్యావరణాన్ని పరిరక్షిస్తాయని, ప్రతీ ఒక్కలు మొక్కలు నాటడంతో పాటు వాటిని సరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో గ్రేడ్-2 కార్యదర్శి రామోజు రాము, ఏఎస్‌లు రాజ్‌కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కార్యదర్శి పోలెపాక నిర్మల



సమావేశంలో అభివాదం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

లౌకికత్వాన్ని కాపాడండి

మతోన్మాదానికి వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో సదస్సు

ఖిలావరంగల్, జూలై 25: దేశంలో మతోన్మాదాన్ని వ్యతిరేకించాలని, లౌకికతత్వాన్ని కాపాడుకోవాలని సీపీఎం, ఎంసీపీఐ(యూ), సీపీఐ-ఎంఎల్, న్యూడెమోక్రసీ, సీపీఐ-ఎంఎల్, మాస్‌లైన్ వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సును నిర్వహించారు. గురువారం ఏసీరెడ్డినగర్‌లోని రఘునాథ్ భవన్ మతోన్మాదానికి వ్యతిరేకంగా జిల్లా సదస్సును పెద్దారపు రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, ఎంసీపీఐయు రాష్ట్ర నాయకుడు గోనె కుమారస్వామి, సీపీఐ-ఎంఎల్, న్యూడెమోక్రసీ నాయకుడు గంగుల దయాకర్‌లు మాట్లాడుతూలో దేశం అనేక కులాలు, మతాలు, సంస్కృతి, సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు నిలయమన్నారు. స్వా తంత్ర్య పోరాటం తర్వాత కొన్ని దేశాలు మతాలుగా విడిపోయినా, భారతదేశం లౌకికతత్వ దేశంగా ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. బీజేపీదాని అనుబంధ సంఘాలైన ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, భజరంగ్ దళ్, మత సంస్థలన్నీ దేశాన్ని హిందూమత దేశంగా ఉండేలా తయారు చేయాలని చూస్తున్నాయన్నారు. సదస్సులో నలిగంటి రత్నమాల, ఎంసీపీఐయు నాయకుడు సత్యనారాయణ, సీపీఎం నాయకులు వలదాసు దుర్గయ్య, సింగారపు బాబు, న్యూడెమోక్రసీ నాయకుడు రావర్ల బాలరాజు, పీడీఎస్‌యు నుంచి చిర్ర సూరి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 6న గద్దర్, జహీరుద్దీన్ యాది సభ

ఖిలావరంగల్, జూలై 25: ప్రజా యుద్ధనౌక గద్దర్, ఉర్దూ దినపత్రిక ఎడిటర్ జహీరుద్దీన్‌ఖాన్‌ల ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆగస్టు 6న యాది సభను నిర్వహించనున్నట్లు సామాజిక ప్రజాకవుల కళాకారుల స్మారక కమిటీ రాష్ట్ర కన్వీనర్ గడ్డం శరత్ తెలిపారు. గురువారం లేబర్‌కాలనీలోని అమరవీరుల స్థూపం వద్ద యాదిసభ పోస్టర్‌ను సూదమల్ల అశోక్ అధ్యక్షతన ఆవిష్కరించారు. శరత్ మాట్లాడుతూ ఆగస్టు 6న, తెలంగాణ జంక్షన్ నర్సంపేటరోడ్ వద్ద గద్దర్, జహీరుద్దీన్ ఖాన్‌ల యాది సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సోమ రాంమూర్తి, గద్దల కుమారస్వామి, లింగాల ఇమ్మానియెల్, పోగుల కన్నయ్య, గడ్డం సుధాకర్, ల్యాదల్ల భరత్, కంజర్ల జేకబ్ పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇంటిగోడ

ఖిలావరంగల్, జూలై 25: వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి నగరంలో ఓ ఇంటిగోడ కూలింది. గురువారం క్రిస్టియన్‌కాలనీలో పోలెపాక మార్త-ఆరోన్ దంపతులు నివాసముంటున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి గోడలు నాని కూలి పోయిందని దంపతులు పేర్కొన్నారు. కాగా దంపతులు పడుకున్న గది కాకుండా ప్రహరి బయటివైపు కూలిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

నేటి నుంచి 'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీలు

సంగెం, జూలై 25: నేటి నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కాసర్ల రవీందర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఫీల్డ్ ఆఫీసర్లకు దిశానిర్దేశం చేసినట్టు తెలిపారు. 15వ సామాజిక తనిఖీలకు గ్రామపంచాయతీ కార్యదర్శులు సైతం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో మరుపట్ల కొమురయ్య, ఏపీవో ఆడెపు గణేష్, ఎస్‌టీఎం సాయినాథ్, ఎస్ఆర్పీ చెన్నకేశవులు, సీసీలు పాల్గొన్నారు.

నేడు మేడిగడ్డ బ్యారేజీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

మహదేవపూర్ రూరల్, జూలై 25: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధామనైన మేడిగడ్డ బ్యారేజీని నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్‌రావు సహ మరో 23మంది ఎమ్మెల్యేలు శుక్రవారం సందర్శించనున్నారు. బ్యారేజీ బ్లాక్-7లో పిల్లర్లు కుంగిన నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతులు పూర్తికాగా ప్రస్తుతం బ్యారేజీ వద్ద 7లక్షల పైచిలుకు ఇన్‌ఫ్లో వస్తుంది. అయితే అంత వరదను సైతం తట్టుకుని పిల్లర్లు నిలబడితే బ్యారేజీ పనికిరాదంటూ, యావత్ కాళేశ్వరం ప్రాజెక్టు వృథా అంటూ కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు తిప్పికొట్టేందుకే ఎమ్మెల్యేల బృందం బ్యారేజీని సందర్శించున్నట్లు మండల బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. బ్యారేజీలో నీటినిల్వ చేస్తేనే బ్యారేజీ సామర్థ్యం బయటపడే అవకాశం ఉందని.. అప్పుడుగాని పిల్లర్ల పరిస్థితి ఎంటనేది స్పష్టమవుతుందని పలువురు కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.

పీజీతండాలో తీజ్ ఉత్సవాలు

దుగ్గొండి, జూలై 25 : మండలంలోని పీజీతండాలో గురువారం గ్రామస్తులు తీజ్ ఉత్సవాలను సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు.తండావాసులు మంచం వేసి తొమ్మిది రకాల విత్తనాలను ఉంచి తొమ్మిది రోజుల పాటు విత్తనాలు మొలకెత్తే విధంగా అన్నిరకాల ఏర్పాట్లు చేశారు. తండా యువతులు, మహిళలు మొలకెత్తిన నారు బతుకమ్మల పేర్చి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 26 జూలై 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



ఉమేష్ (ఫైల్)

చెన్నారావుపేట, జూలై 25 : మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్ గ్రామ చంద్రుతండాకు చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గూడ అరుణ్ కుమార్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఇదే తండాకు చెందిన బోడ ఉమేష్ (27) అనే యువకుడు బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. వైద్యులు పరీక్షలు చేసి క్యాన్సర్ వ్యాధి ఉందని తేలిపారు. దీంతో తీవ్ర మనోవేదనతో ఉమేష్ ఇంట్లో ఎవరు లేని సమయంతో బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే చికిత్స కోసం నర్సంపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నల్లబెల్లి, జూలై 25 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి తీరని అన్యాయం జరిగిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి తెలిపారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాన మంత్రి మోదీ అవలంబిస్తున్న విధానాలు సరైనవి కావన్నారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో దేశంలోని ఏప రాష్ట్రలకు ఎంత వస్తుందో అంత కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నైనాల అశోక్, ఇస్తారు శేఖర్‌గౌడ్, చార్ల శివారెడ్డి, పెంతల కొమురారెడ్డి, మామిళ్ల కొమురెల్లి, జెట్టి రాంమూర్తి, ఏడాకుల సంపత్‌రెడ్డి, పురుషోత్తం సురేష్, బత్తిని మహేష్, ఎరుకల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పాటుపడాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గోగుల రాణాప్రతాప్ రెడ్డి

నర్సంపేట, జూలై 25 : బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపు నిచ్చారు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం కార్యకర్తల సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతంచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయం, నిరుద్యోగులు, మహిళలు, గ్రామీణాభివృద్ధికి ప్రధాన్యత ఇచ్చిందన్నారు. విద్యా, ఉపాధి రంగాలపై ప్రత్యేక దృష్టిని సారించిందన్నారు. కార్యక్రమంలో నియోకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసుశ్రీనివాస్, కట్ల రాంచంద్రారెడ్డి, గడ్డం ఆంజనేయులు, మండల కార్యదర్శి రాజు, బీజేవైఎమ్ మండల అధ్యక్షుడు ఆముదాల రమేశ్, బీజేపీ నాయకులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

దుగ్గొండి, జూలై 25 : మండలంలోని గిర్నిబావి సమీపంలో మందపల్లికి వెళ్లే రోడ్డుపై గురువారం కూలీల ట్రాలీ ఆటో బోల్తా పడగా పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని పీజీతండాకు చెందిన 16 మంది కూలీలు వరి నాటు వేయడానికి ట్రాలీ ఆటోలో గిర్నిబావి వైపు ప్రయాణిస్తుండగా, గిర్నిబావి సమీపంలో ఎదురుగా ప్రైవేట్ పాఠశాల బస్సు రాగా, బస్సును తప్పించబోయి ట్రాలీ ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న నూనావతు తారమ్మ, నూనావతు పద్మ, లావుడియా రాజమ్మ, నూనావతు పద్మలతో పాటు పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని వరంగల్, నర్సంపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు.

బాబోయ్ కుక్కలు



నందమూరి నగర్‌లో సంచరిస్తున్న కుక్కలు

నెక్కొండ, జూలై 25 : పల్లె ప్రాంతాల్లో సాధు జంతువులుగా ఉంటూ ఇంటి యజమానికి నమ్మకంగా ఉండడంతో పాటు అటవి ప్రాంతంలో మేతకోసం వెళ్లే గొర్రెలు, మేకలను తోడేళ్ల బారి నుంచి కాపాడుతూ విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిన గ్రామ సింహాలు (కుక్కలు) ప్రస్తుతం ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. వీధుల్లో కుక్కల గుంపు అరుపులకు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు పరుగులు తీస్తూ కుక్క కాట్లకు గురవుతుండగా, రోడ్ల వెంట కుక్కల పరుగులతో తరచుగా వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నెక్కొండలో రైల్వే ట్రాక్ కారణంగా రైలు ఢీకొని మనుషులు, మూగ జంతువులు కూడా మృతి చెందుతుండటంతో నెక్కొండ పరిసర మండలాల్లోని, గ్రామాల్లోని కుక్కలు ట్రాక్ వెంట సంచరిస్తూ కుళ్లిన మాంసం, వ్యర్థాలను తింటుంటాయి. మాంసాహారానికి అలవాటు పడిన కుక్కలు వీధుల్లో సంచరించే నాటు కోళ్లు, పశువులు, గొర్రెలు, మేకలపై దాడులు చేస్తున్నాయి. మనుషులు సైతం కుక్కల దాడులకు గురవుతున్నారు. కుక్కలు దాడి చేసుకుంటున్న సమయంలో వీధుల నుంచి ప్రజలు బయటకు రాలేకపోతున్నారు. రాత్రి సమయంలో రైళ్లు దిగిన ప్రయాణికులు రోడ్ల వెంట నడవటానికి సహసం చేయాల్సి వస్తుంది.

మండలంలోని సూరిపల్లిలో పలువురు రైతులకు చెందిన 15గేదెలు కుక్క కాటుతో రేబీస్‌వ్యాధిసోకి మృతి చెందాయి.నాగారం, వెంకటాపురం గ్రామాల్లో మేకల మందపై కుక్కల దాడితో 30 మేకలు మృత్యువాతపడ్డాయి.

నియంత్రణ చర్యలు శూన్యం

గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరించే పిచ్చికుక్కల నియంత్రణకు గతంలో పంచాయతీ పాలకులు, అధికారులు చర్యలు తీసుకొనేవారు. కోర్టు నిబంధనల ప్రకారం కుక్కలను చంపడం నేరం కావడంతో నియంత్రణకు చర్యలు తీసుకోవడంలేదు. కుక్కలతో ప్రజలకు కలిగే ఇబ్బందులను అధికారులు గుర్తించి కుక్కలను జన సంచారంలేని ప్రాంతాలకు తరలిస్తే బాగుండేదని పలువురు అంటున్నారు.

కలెక్టర్‌ను కలసిన కుక్కకాటు బాధితుడు

ఇటీవల నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీకి వచ్చిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద, చికిత్సకు వచ్చిన రోగులను ప్రశ్నించుతున్న క్రమంలో తాను కుక్కకాటు నివారణ వాక్సిన్ కోసం వచ్చినట్లు భూపతి రెడ్డి తెలిపాడు. కుక్క కాటు నుంచి ప్రజలను కాపాడేందుకు కుక్కల మూతులకు బుట్టలను బిగించే విషయమై ఆచరణలో పెట్టే ఆలోచనలో ఉన్నట్లు కలెక్టర్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

చర్యలు తీసుకుంటాం

సదానందం, కార్యదర్శి, నెక్కొండ



నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిల్లో కుక్కలబెడద ఎక్కువైంది. రాత్రి సమయంలో రైళ్లు దిగి వస్తున్న ప్రయాణికులు కుక్కలతో భయభ్రాంతకులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని సంబంధితాధికారుల దృష్టికి తీసుకువెళ్లాము. వారి అనుమతి రాగానే కుక్కలను బంధించి అటవీ ప్రాంతంలో వదిలేందుకు చర్యలు తీసుకుంటాము.

ఏడాదైనా కలగని మోక్షం!



కోతకు గురైన రోడ్డు, దెబ్బతిన్న కల్వర్టు

పర్వతగిరి, జూలై 25 : గతేడాది కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలకు మండల కేంద్రంలోని తారురోడ్డు కొట్టుకుపోయింది. మండల కేంద్రం నుంచి రోళ్లకల్లు గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో ఇరు గ్రామాల ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగైదు చోట్ల రోడ్డు కొట్టుకుపోవడంతో పొలాలకు విత్తనాలు, ఎరువులు తదితరాలను తీసుకెళ్ల డానికి గాను వీలులేకుండాపోయింది. చుట్టు పక్కల రైతులు కేవలం నడవడానికి గాను దారి ఏర్పాటుచేసుకున్నారు. దీంతో కష్టాలు పడుతూ దారి వెంట నడుస్తున్నారు.

పట్టింపులేని అధికారులు

వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయి, మరికొన్ని చోట్ల కోతకు గురై సంవత్సరం గడుస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వం, అధికారులు కనీసం తట్టెడు మట్టి కూడా పోయలేదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వరదలతో రోడ్డు నడవడానికి సైతం వీళ్లేకుండా కొట్టుకుపోయిందని, వరదల సమయంలో అధికారులు వచ్చి చూసివెళ్లారేగానీ, నేటికీ మరమ్మతుల మాట ఎత్తడంలేదని వాపోతున్నారు.రోడ్డుకు భారీగా కోతలుపడడంతో ఎడ్లు, ఎడ్లబండ్లు వెళ్లడానికి వీలులేకుండా ఇబ్బందులు పడు తున్నామని, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులుచేపట్టాలని పలువురు రైతులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

కుక్క, కోతి మైత్రి



కలియదిరుగుతున్న కుక్క కోతి

వర్ధన్నపేట, జూలై 25 : జాతి వైరాన్ని మరచిన ఓ కోతి, కుక్కల మధ్య మైత్రిగా మారిన సంఘటన గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలో ఓ వానరం, శునకం దోస్తీ చేస్తున్నాయి. కలివిడిగా కలిసి ఉంటూ పురవీధుల్లో సంచరిస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఎక్కడైనా వానరాలు శునకాన్ని చూసి ఆమెడ దూరం పరుగుతీస్తాయి. కానీ ఇక్కడ అలాంటి సన్నివేశానికి భిన్నంగా ఉంది. చక్కటి చెలిమి చేస్తూ నాకు నీవు.. నీకు నేను అన్న విధంగా కలిసి జీవిస్తున్నాయి. మానవ సంబంధాలు ప్రశ్నార్థకంగా మారిన ఈ ఆధునిక యుగంలో వనరాలు, శునకాలు కలిసి ఉండడం విశేషంగా మారింది. దీంతో కుక్క, కోతి స్నేహంగా కలిసి ఉండడాన్ని స్థానికులు చర్చించుకుంటున్నారు.

పీజీతండాలో తీజ్ ఉత్సవాలు

దుగ్గొండి, జూలై 25 : మండలంలోని పీజీతండాలో గురువారం గ్రామస్థులు తీజ్ ఉత్సవాలను సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు.తండావాసులు మంచం వేసి తొమ్మిది రకాల విత్తనాలను ఉంచి తొమ్మిది రోజుల పాటు విత్తనాలు మొలకెత్తే విధంగా అన్నిరకాల ఏర్పాట్లు చేశారు. తండా యువతులు, మహిళలు మొలకెత్తిన నారు బతుకమ్మల పేర్చి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

డ్రైనేజీల్లో వ్యర్థాల తొలగింపు

వర్ధన్నపేట, జూలై 25 : గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వర్ధన్నపేట పట్టణంలోని వివిధ వార్డుల్లోని డ్రెయినేజీల్లో వ్యర్థపదార్థాలు పేరుకుపోయాయి. మునిసిపల్ కమిషనర్ ఇ.జోనా ఆదేశం మేరకు మునిసిపల్ సిబ్బంది గురువారం పట్టణంలోని వార్డుల్లో డ్రైనేజీలను శుభ్రం చేశారు. బ్లీచింగ్ పౌడర్, టెమోఫాస్ రసాయన మందుతో డ్రైనేజీల్లో పిచికారి చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

వర్ధన్నపేట, జూలై 25 : వర్ధన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలోని నీలగిరి స్వామి తండాలో పేకాట శిబిరంపై గురువారం స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.6,190 నగదును స్వాధీనపర్చుకొని సీజ్‌చేసి, ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

పర్వతగిరి, జూలై 25 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మేరుగు వెంకటేశ్వర్లు తల్లి మేరుగు ఐలమ్మ ఇటీవల అనారోగ్యం తో మృతిచెందగా ఆమె కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మోటపోతుల మనోజ్‌గౌడ్,మాజీ ఎంపీటీసీ మాదుగుల రాజు, నాయకులు కంటెం ఏకాంతం, జూల్లపెల్లి దేవేందర్‌రావు, కిష్టయ్య, భాస్కర్, తిరుపతి ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చెన్నారావుపేట, జూలై 25 : మండల కేంద్రానికి చెందిన ఎడ్ల రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబానికి దాతల సహకారంతో గురువారం రూ.66,500 ఆర్థిక సాయాన్ని అందించారు. గౌడ సంఘం మండల డైరెక్టర్ మాచెర్ల ఎల్లగౌడ్, ఎడ్ల మల్లయ్యకుమార్, భూక్య శ్రీనువాస్ నాంపెల్లి సంపత్ తదితరులు ఉన్నారు.

గుడుంబా తయారుదారులపై కేసు

నల్లబెల్లి, జూలై 25 : మండలంలోని రేలకుంటకు చెందిన గుడుంబా తయారుదారులైన హలవత్ వనిజ, సమ్మయ్య పై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేలకుంటలో హలవత్ వనిజ, సమ్మయ్యలు ఇంటి వద్ద రేకుల షెడ్డులో తనిఖీ చేస్తున్న క్రమంలో 15 లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. దీని విలువ రూ.3 వేలు ఉంటుంది. అనంతరం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు.

నేడు మేడిగడ్డ బ్యారేజీకి ఎమ్మెల్యేల బృందం

మహదేవపూర్ రూరల్, జూలై 25 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధామనైన మేడిగడ్డ బ్యారేజీని నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్‌రావు సహా మరో 23మంది ఎమ్మెల్యేలు శుక్రవారం సందర్శించనున్నారు. బ్యారేజీ బ్లాక్-7లో పిల్లర్లు కుంగిన నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతులు పూర్తికాగా ప్రస్తుతం బ్యారేజీ వద్ద 7లక్షల పైచిలుకు ఇన్‌ఫ్లో వస్తుంది. అయితే అంత వరదను సైతం తట్టుకుని పిల్లర్లు నిలబడితే బ్యారేజీ పనికిరాదంటూ, యావత్ కాళేశ్వరం ప్రాజెక్టు వృథా అంటూ కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు తిప్పికొట్టేందుకే ఎమ్మెల్యేల బృందం బ్యారేజీని సందర్శించున్నట్లు మండల బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, బ్యారేజీలో నీటినిల్వ చేస్తేనే బ్యారేజీ సామర్థ్యం బయటపడే అవకాశం ఉందని.. అప్పుడుగాని పిల్లర్ల పరిస్థితి ఎంటనేది స్పష్టమవుతుందని పలువురు కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. నీటిని నిల్వచేయకముందే దాని సామర్థ్యం ఎలా తెలుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

పంటల ధ్వంసం

- అడవి పందులతో రైతుల ఆందోళన



ధ్వంసమైన పంటను చూపుతున్న ఓంకార్‌రెడ్డి

దుగ్గొండి, జూలై 25 : సాగు చేసిన వేరుశనగ, మొక్క జొన్న పంటలను అడవి పందులు స్వైరవిహారం చేసి ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తిమ్మంపేటలో కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో అడవి పందులు సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేస్తున్నట్లు రైతులు వెల్లడించారు. మొక్కజొన్న పంట పీసు వేయగా, వేరుశనగ పంట కాత దశలో ఉండగా అడవి పందులు పంటలను ధ్వంసం చేయడంతో నష్టపోతున్నామని రైతులు ఆందోళన పడుతున్నారు. తిమ్మంపేటలోని గొర్రె ఓంకార్ రెడ్డి వేరుశనగ పంట, భూపాల్‌రెడ్డి మొక్క జొన్న పంటలు అడవి పందులు నష్టం చేసినట్లు పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

వర్ధన్నపేట, జూలై 25 : పంటల సాగులో ఎరువుల వాడకమే కీలకం. ఏయే దశల్లో ఎంత మోతాదులో ఏయే ఎరువులు వాడాలనే విషయంపై రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. ఎరువుల వాడకంలో తగు జాగ్రత్తలు పాటించాలని వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి సాగరిక పేర్కొంటున్నారు. ఎరువుల యాజమాన్యానికి సంబంధించి రైతులు పాటించాల్సిన సలహాలు, సూచనలు ఆమె మాటల్లోనే..

రసాయన ఎరువులతో నష్టం

రసాయన ఎరువుల వాడకం శ్రేయస్కారం కాదు. దీని వల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా భూసారం తగ్గుతుంది. విరివిగా, విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడటం తగ్గించాలి. వీటి వాడకం వలన క్రమేపీ పంట దిగుబడులు కూడా తగ్గుతాయి.

సేంద్రియ ఎరువులే మేలు

సేంద్రియ ఎరువుల వాడకం మూలంగా అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఉంది. నేలకు సేంద్రియ పదార్థాలు జీవం వంటివి. పశువుల ఎరువు, కంపోస్టు, ఫిల్టర్ మడ్డి, పచ్చిరొట్ట ఎరువులు, వ్యవసాయ వ్యర్థ పదార్థాల వాడకం, జీవన ఎరువుల వాడకం ప్రాధాన్యతను గుర్తించాలి.

ఎరువుల ధరలపై అవగాహన అవసరం

ఎరువుల వాడకం ఎంత ముఖ్యమో.. వాటి ధరలపై అవగాహన కలిగి ఉండడం కూడా అంతే ముఖ్యం. ఏయే ఎరువుల్లో ఎంత శాతం ఉంటుంది. నాణ్యత ధరలు, నకిలీలు వంటి వాటిని గమనించాలి. దీనికి వ్యవసాయ అధికారులు, అవగాహన ఉన్న రైతుల సలహాలు తీసుకోవాలి.

వెదజల్లే పద్ధతి

సరైన పద్ధతిలో ఎరువులు వేయడం చాలా ముఖ్యం. సాధారణంగా ఎరువులను రెండు పద్ధతుల్లో వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో మొక్కలు దగ్గర దగ్గరగా ఉంటే మేలు జరుగుతుంది. వరుస క్రమంలో లేని మొక్కలకు వేళ్లు భూమిలో అల్లుకుపోయే పైర్లకు ఈ పద్ధతి అనుకూలంగా ఉంటుంది. వరికి కూడా ఈ పద్ధతి చాలా మేలు చేస్తుంది.

పాదుల్లో ఎరువు వేసే పద్ధతి

మొక్కల దగ్గర ఎరువులు వేసే పద్ధతి ద్వారా పోషక వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. వృథా కూడా తగ్గుతుంది. నిర్దీత వరుసల్లో మొక్కలు ఉన్నపుడు పొలాన్ని 2 అంగులాల మేరకు లోతు చేసుకుని తేమ ఉన్నపుడు మొక్కల మొదళ్ల దగ్గర ఎరువు పడేలా వేయాలి. చిన్నపాటి గుంతలు తీసి ఎరువులు వేసిన సమయంలో దానిని మట్టితో కప్పేలా చూసుకోవాలి.

ఎరువుల వాడకంలో పాటించాల్సిన పద్ధతులు

లోతు దుక్కులవల్ల భూమి పొరలు గుల్లబారి తేమను బాగా నిల్వ చేసుకుంటాయి. వేసిన ఎరువును ఎక్కువశాతం మొక్కలు తీసుకుంటాయి. పంటలో ఉన్న కలుపును పూర్తిగా తొలగించిన అనంతరం తేమ ఉన్న దశలోనే ఎరువులు చల్లుకోవాలి. యూరియాను వేప పిండితో కలిపిగాని, యూరియా ఎరువుతో వేపనూనె కలుపుకుని వాడితే నత్రజని నెమ్మదిగా విడుదలవుతూ వృథా తగ్గుతుంది. కోల్‌థార్‌తో 2లీటర్ల కిరోసిన్‌తో మిశ్రమం చేసి రెండు బస్తాల యూరియాలో కలిపితే మంచి ఫలితాలు వస్తాయి. అరబస్తా యూరియాను ఒక బస్తా తడి, పొడి మట్టితో కలిపి 24 గంటలు నీడలో ఉంచి ఆ తరువాత నేలకు అందిస్తే వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

వరుణుడి కరుణ కోసం వన భోజనాలకు..

నెక్కొండ, జూలై 25 : వర్షా కాలం ఆరంభమై రెండు నెలలు గడుస్తున్నా ఈ సంవత్సరం ఆశించిన మేర వర్షాలు కురవక పోవడంతో గ్రామాల్లో నీరు లేక ఊర చెరువులు వెలవెల బోతున్నాయి. దీంతో వర్షాలు కురిపించాలంటూ వరుణదేవుడిని ప్రార్థించుకుంటు పల్లె ప్రజలు వనభోజనాలకు వెళ్తున్నారు. వర్షాలు కురుస్తాయన్న ఆశతో ఇప్పటికే వరినారు సాగుచేసి నాట్లు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. వర్షాలు కురవకపోవడంతో వరినారు ముదిరి పనికిరాకుండా అవుతుందంటూ ఆందోళన చెందుతున్నారు. పూర్వం రోజుల్లో వర్షాలు ఆలస్యం అయితే ప్రజలు వన భోజనాలకు వెళ్లేవారని, అదే బాటలో తాము నడుచుకుంటున్నామంటూ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో పల్లె ప్రజలు వనభోజనాలకు ఉమ్మడిగా అడవులకు వెళ్లడంతో పల్లెలోని ఇండ్లలో ప్రజలు కనిపించడం లేదు. వరుణుడు కరుణకోసం వనభోజనాలకు వెళ్తున్నామంటున్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలను పాటించాలి

చెన్నారావుపేట, జూలై 25 : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలను పాటించాలని డాక్టర్ సరోజ అన్నారు. గురువారం ఎల్లాయిగూడెంతో పాటు పలు గ్రామాలల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షంతో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు మరింతటీ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉండాలన్నారు. వర్షాకాలంలో నీరు ఇంటి పరిసరాలల్లో నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ రమాదేవి, రామెల్, పుష్పలత, క్రాంతి, సరిత, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పది నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు



ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందిస్తున్న జీపీ కార్మికులు

నెక్కొండ, జూలై 25 : గ్రామ పంచాయతీల్లో విధులను నిర్వహిస్తున్న జీపీ కార్మికులకు పది నెలల నుంచి వేతనాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు భూక్యా నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. జీపీ కార్మికుల ఆర్థిక ఇబ్బందులను తీర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ గురువారం నెక్కొండ ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కార్మికులు వంగల శ్రీనివాస్, శివరాజు, రాధాకృష్ణ, కిషోర్, సతీష్, రాజు, కుమారస్వామి, కిషన్, భాస్కర్, సంతోష్, సంపత్, రామూర్తి, జయరాజు పాల్గొన్నారు.

గుడుంబా రవాణా చేస్తున్న ఒకరి అరెస్ట్

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), జూలై 25 : కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో ప్లాస్టిక్ కవర్లలో 50 లీటర్ల గుడుంబాను బాదావత్ బాబు రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్దకొర్పోలు శివారు రేకులతండాకు చెందిన బాదావత్ బాబు రైలులో ఈ గుడుంబా ప్యాకెట్లను కేసముద్రానికి తీసుకువచ్చి తరలిస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. అలాగే మండలంలోని కల్వల శివారు గాంధీపురం జీపీ పరిధిలోని వెంకట్రాంతండాలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 20 లీటర్ల గుడుంబాను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. తండాలో గుడుంబా తయారు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ రమేష్, పీసీలు రాజు, వెంకన్న, డబ్ల్యూపీసీ హైమ పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీలు

సంగెం, జూలై 25 : నేటి నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కాసర్ల రవీందర్ తెలిపారు. గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఫీల్డ్ ఆఫీసర్లకు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. 15వ సామాజిక తనిఖీలకు గ్రామపంచాయతీ కార్యదర్శులు సైతం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో మరుపట్ల కొమురయ్య, ఏపీవో ఆడెపు గణేష్, ఎస్‌టీఎం సాయినాథ్, ఎస్ఆర్పీ చెన్నకేశవులు, సీసీలు పాల్గొన్నారు.

కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

పర్వతగిరి, జూలై 25 : పంచాయతీ కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని మండల స్పెషల్ ఆఫీసర్, డీసీవో సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో ఆయా గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీరోజూ ఉదయమే కార్యదర్శులు గ్రామాలకు చేరుకుని పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. మంచినీటి సరఫరా విషయంలో జాగ్రత్తగా ఉండాలని, విధుల్లో అలసత్వం వహిస్తే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీవో పాక శ్రీనివాసులు, మండల నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి, ఏపీవో సుశీల్‌కుమార్, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఎంపీవోను కలిసిన దళిత నాయకులు

నల్లబెల్లి, జూలై 25 : నల్లబెల్లి ఎంపీవో పసరుగొండ రవిని గురువారం మర్యాద పూర్వకంగా దళిత సంఘ నాయకులు కలిశారు. అనంతరం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో దళిత నాయకులు బట్టు సాంబయ్య, బొట్ల నరేషులు ఎంపీవోను సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వేదావతి, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, ధర్మేందర్, కంప్యూటర్ ఆపరేటర్ రఘువరన్, కుండి అశోక్ తదితరులు పాల్గొన్నారు.